# సర్వచింతలకు దివ్యౌషధం భగవత్ప్రేమ

*ప్రేమస్వరూపులారా! యువతీ యువకులారా!*

ఈనాడు మనం మానవతావిలువలను గుర్తించడం అత్యవసరం. మానవతా విలువలు మానవునియందు శూన్యమైపోవడంచేత తాను మానవునిగా జీవించలేకపోతున్నాడు. మానవునిలో ఉన్న గుణములు రెండు విధములు – బహిర్ముఖమైనవి, అంతర్ముఖమైనవి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు – ఇవి బహిర్ముఖమైనవి; సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు అంతర్ముఖమైనవి. ఈనాడు మనము అంతర్ముఖమైన, సత్యనిత్యమైన భావములను విసర్జించి, బహిర్ముఖమైన, అనిత్యమైన విషయాలను పట్టుకొని ప్రేలాడుతున్నాము. అంతర్ముఖమైన ఆత్మ భావమును మనము పెంచుకోవాలి. సత్యము ఒక్కటి ఉంటే చాలు, ధర్మము తనంతట తానే వస్తుంది. నెగెటివ్, పాజిటివ్‌లవలె సత్య ధర్మములు రెండూ చేరినప్పుడు మనకు శాంతి చేకూరుతుంది. శాంతి చేకూరినప్పుడు ప్రేమ మనలో ఆవిర్భవిస్తుంది. ప్రేమ మనలో ఆవిర్భవించినప్పుడు హింస అనేదే ఉండదు. ఈనాడు లోకంలో ఎక్కడ చూసినా హింసలు! ఎక్కడ చూసినా బాధలు! ఎక్కడ చూసినా కష్టములు! కనుక, మీరు అంతర్ముఖమైన మానవతా విలువలను అభివృద్ధి పరచుకోవడానికి ప్రయత్నము చేయాలి. 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్య మప్రియం' (సత్యమును పలుకుము. ప్రియముగా మాటలాడుము. అప్రియమైన సత్యమును పలుకవద్దు). సత్యము శాశ్వతమైనది. అది ఒకరివలన పుట్టేది కాదు, ఒకరితో మరణించేది కాదు. సత్యము వీరికొకవిధంగా, వారికొక విధంగా ఉండదు. సత్యము అందరికీ ఒక్కటే. సత్యమును పోషించుకున్నప్పుడే మీరు ధర్మమార్గంలో నడుచుకోవడానికి వీలవుతుంది. మీరు హృదయంలో తలచినది నోటితో చెప్పాలి. నోటితో చెప్పినది క్రియలో నిరూపించాలి. ఇదియే నిజమైన మానవత్వము. "ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి." ఉన్నది ఒక్కటే,

sri sathyasai vahini amrutam

రెండవది లేనే లేదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ." బ్రహ్మస్వరూపమే సత్యము. బ్రహ్మ సర్వత్రా ఉన్నాడు. కనుక, మీరు మొట్టమొదట సత్యమును అభివృద్ధిపరచుకోండి; హృదయములో స్థాపించుకోండి. మనలో సత్యము పెరిగేకొలదీ ధర్మము చిగుర్లు వేస్తూ వస్తుంది. ధర్మము చిగుర్లువేసేకొలది మనలో శాంతి ఉప్పొంగుతుంది. శాంతి ఉప్పొంగి నప్పుడు ప్రేమకూడా విశాల మవుతుంది. ఈనాటి మానవుడు తన ప్రేమను కేవలం తన భార్యాబిడ్డలకు పరిమితం చేస్తున్నాడు; ప్రేమను విశాలం గావించుకోవడం లేదు. ప్రేమ విశాలమైనప్పుడు తనవారు, పరాయివారు అనే భేదము లేకుండా అందరినీ ప్రేమిస్తాము. అప్పుడే లోకములో అహింస రాజ్యమేలుతుంది. ఒకరినొకరు తిట్టుకోవడం, కొట్టుకోవడం అనేది ఉండదు.

మానవుడు ఎంతో గొప్ప శక్తి కలిగినటువంటి వాడు. ఆ శక్తిని తాను సద్వినియోగపరచుకోవాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను అదుపులో పెట్టుకోవాలి. ఇంద్రియాలను విచ్చలవిడిగా విడిచిపెట్టకూడదు. మీరు పాటలు పాడుతుంటారు. ఆ పాటలను శ్రుతికి తగినట్లుగానే పాడాలి. శ్రుతి తప్పితే వినడానికి ఇంపుగా ఉండదు. అట్లే, ఆశలు హద్దు మీరితే అశాంతికి గురికావలసి వస్తుంది. నీకు పెండ్లి కావాలంటావు. సంతోషం, చేసుకో! తరువాత పిల్లలు కావాలంటావు. సంతోషం! వారిని చక్కగా పెంచి పోషించి, ఉద్ధరించే నిమిత్తం కొన్ని ధర్మములు నియమించాడు, భగవంతుడు. ఇష్టమొచ్చినట్లు పశు పక్షిమృగాదులవలె మనము ప్రవర్తించకూడదు. మన ప్రవర్తన మన అదుపులో ఉండాలి. ఇదే ప్రధానమైన మానవతా విలువ.

మానవతా విలువలు కంటికి కనిపించేటటువంటివి కావు. సత్యమునకు రూపమేమిటి? అది మన హృదయమునుండి ఆవిర్భవిస్తుంది. ధర్మమునకు రూపమేమిటి? మన హృదయము చేసే ప్రబోధలను అనుసరించడమే ధర్మము. శాంతి ఎక్కడుంది? బాహ్య ప్రపంచంలో ఉందా? లేదు. బయట అంతా అశాంతే! అశాంతే! ఎన్ని సిరిసంపదలున్నప్పటికీ మానవుడు తనకు శాంతి కావాలని ఆశిస్తూనే ఉంటాడు. ఏ కోటీశ్వరుడినైనా మీరు అడిగి చూడండి – 'నాకన్నీ ఉన్నాయి. కాని, శాంతి లేదు' అంటాడు. శాంతి బయట చిక్కేది కాదు. అది లోపలినుండియే ఆవిర్భవిస్తుంది. శాంతి వచ్చేటప్పటికి ప్రేమ ప్రజ్వరిల్లుతుంది. ఆ ప్రేమ ప్రకాశము అందరిపై ప్రసరిస్తుంది. నీకూ,

sri sathyasai vahini amrutam

నాకూ, పద్మాల్గు లోకా లన్నింటికికూడను ప్రకాశమునందించేది ప్రేమయే! ప్రేమను బలపరచుకుంటే ద్వేషమే ఉండదు. భేదమనేది ఉన్నప్పుడే ద్వేషము వస్తుంది. 'నీవు, నేను ఒక్కటే' అని గుర్తించినప్పుడు ఒకరిపై ఒకరికి ద్వేషము ఏరీతిగా వస్తుంది! అసూయా ద్వేషములు, కామక్రోధాదులు ఎవ్వరికీ ఉండకూడదు బంగారూ! ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. "ప్రేమముదిత మనసె కహో రామ రామ రామ్..." ప్రేమ అనేది భగవంతుడు మానవునికి ప్రసాదించిన గొప్ప వరం. వస్తువులకు విలువ కట్టవచ్చుగాని, ప్రేమకు ఇంత, అంత అని విలువ కట్టటానికి వీలుకాదు. కాబట్టి, ప్రేమను పెంచుకోండి! పెంచుకున్నంత మాత్రమున చాలదు, ప్రేమను పంచుకోండి! మీ ప్రేమను ఇంకొకరికిచ్చి, వారి ప్రేమను మీరందుకుంటూ జీవితాన్ని గడిపినప్పుడు ద్వేషము, అసూయ, అహంకారము అనే దుర్గుణాలు దగ్గరికి రావడానికి వీలుకాదు. మీకు తెలుసు – 'లక్ష్మణ రేఖ' అని గీస్తుంటారు. ఆ గీతను గీసినప్పుడు దానిని దాటి ఏ చిన్న పురుగుకూడను లోపలకు పోలేదు. అదేరీతిగనే, ప్రేమ ఉన్నచోట ఎటువంటి దుర్గుణాలూ ప్రవేశించటానికి వీలుకాదు. ప్రేమను ఎంతమందికి పంచుకున్నా అది పెరుగుతూనే ఉంటుంది గాని, తరిగిపోదు. ప్రపంచంలోని జనులంతా భగవంతుని పిల్లలే! అందరికీ భగవంతుని ఆస్తిపై సమానంగా హక్కున్నది. ఆ 'ఆస్తి'ని అందరూ పంచుకోవాలి. దేనిని మరచినప్పటికీ భగవంతుణ్ణి మాత్రం మరువకూడదు. ఈ లోకంలో ప్రతి ఒక్కటీ ఈపొద్దు వస్తుంది, రేపు పోతుంది. కాని, ప్రేమ వచ్చి పెరిగేటటువంటిదే గాని, పోయేటటువంటిది కాదు. అట్టి భగవత్ప్రేమను పెంచుకోండి! భగవద్విశ్వాసముతో నిరంతరం నామస్మరణ చేసుకోండి. నిత్యం మనము ఎన్నో మాటలు మాట్లాడుతున్నాము. 'రామా, కృష్ణా...' అనే పవిత్రమైన మాటలు మనకు రావా? తప్పకుండా వస్తాయి. ఆ దివ్య నామములను ఒక్కసారి స్మరిస్తే మన చింతలు, కష్టములు అన్నీ నివారణ అయిపోతాయి.

**పుట్టుట ఒక చింత భూమినుండుట చింత**
**సంసారమొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత చెడుపు చింత**

sri sathyasai vachanamrutam

**కర్మలన్నియు చింత కష్టములొక చింత**
**సంతసమొక చింత వింత చింత**
**సర్వచింతలు బాపెడి సాయిభక్తిని**
**గొనుడు ఇకనైన ప్రజలార ప్రేమమీర!**

ఈ చింతలన్నీ తొలగిపోవాలంటే భగవత్ప్రేమను పెంచుకోండి. అన్ని చింతలకూ అదే దివ్యౌషధం. ఇంట్లో ఏరకమైన చింత ఉన్నప్పటికీ భగవన్నామ స్మరణచేత అది పరిహారమవుతుంది. భగవంతుడు ఎక్కడ చూసినా ఉన్నాడు. పంచభూతములే పరమాత్మ స్వరూపములు. దేహము ఒక నీటిబుడగ. మనస్సు ఒక పిచ్చికోతి. కాబట్టి, దేహమునుగాని, మనస్సునుగాని అనుసరించకూడదు. బుద్ధి ననుసరించాలి. నిర్మలమైన, నిశ్చలమైన చిత్తమును సాధించాలి. మనము చేసే సాధనలన్నీ చిత్తశుద్ధికోసం ఉద్దేశించినవే! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు బాహ్య ప్రపంచమునుండి మనకు సంక్రమిస్తున్నవేగాని, మనలోపలినుండి ఆవిర్భవించినవి కావు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు మనయందే ఉన్నవి. వాటిని ఆవిర్భవింపజేసుకోవాలి.

ఈనాడు ఎక్కడ చూసినా హింసలే! హింసలే! డబ్బుకోసం ఎన్ని రకములైన హింసలో చేస్తున్నారు. డబ్బు వస్తుంది, పోతుంది. ఎంతోమంది రాజులు కోట్ల కొలదీ సంపాదించారు. కాని, ఏ రాజైనాగాని నయాపైసా అయినా తనవెంట తీసికొని వెళ్ళగలిగాడా? లేదు. అలెగ్జాండర్ చక్రవర్తి మరణించేముందు తన మంత్రులను పిలిచి, తన దేహాన్ని ఒక తెల్లని బట్టలో చుట్టి, చేతులను మాత్రం పైకి పెట్టి వీధివీధిలోను ఊరేగించవలసిందిగా కోరాడు. మానవుడు ఎంత ధనమును సంపాదించినప్పటికీ కట్టకడపటికి వట్టి చేతులతోనే పోక తప్పదనే సందేశాన్ని ప్రజలకు అందించాలన్నది అతని ఉద్దేశ్యం. మనము ఎన్ని సంపాదించినా అవన్నీ తాత్కాలికమైన తృప్తికోసమే! సత్యనిత్యమైన ఆనందాన్ని అందించేది ప్రేమ ఒక్కటే! మీరు ఇక్కడున్నంతవరకు మాత్రమే ప్రేమగా ఉంటే చాలదు; ఎక్కడికి పోయినా ప్రేమతో జీవించాలి. ఇక్కడ ఉండు, లేక అమెరికాలో ఉండు; ప్రేమకు ఏమాత్రము మార్పు లేదు. ఏకత్వముతో కూడినది ప్రేమ. అట్టి ప్రేమను పెంచుకోండి. మిమ్మల్ని ద్వేషించేవానినికూడా ప్రేమించండి. వాడు కనిపిస్తే నమస్కరించి 'బ్రదర్, ఎలా ఉన్నావు?'

sri sathyasai vachanamrutam

అని పలుకరించండి. వాడుకూడా 'బ్రదర్! నీవెట్లున్నావు?' అని పలుకరిస్తాడు. అందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళే! భగవంతుడే అందరికీ తండ్రి. 'మీరందరూ నా అంశములే! నేను వేరు, మీరు వేరు కాదు', అన్నాడు కృష్ణుడు. ఇట్టి ఏకత్వాన్ని మీరు విశ్వసించాలి. దేవుడు ప్రతి మానవునియందు హృదయవాసిగా, అంతర్యామిగా ఉన్నాడు. మీరు చేసే ప్రతి కర్మను 'నా హృదయములో ఉన్న భగవంతునికి అర్పితం చేస్తున్నాను', అని భావించండి. సుఖమొచ్చినా, కష్టమొచ్చినా 'ఇది నా మంచికోసమే' అని విశ్వసించండి. మలేరియా జ్వరం వచ్చినప్పుడు చేదుగా ఉండే 'క్వినైన్ మిక్చర్' ఇస్తారు. అదేరీతిగా, మీరు అనుభవించే కష్టాలు మీమంచికోసమే అని గుర్తించండి. భగవత్తత్త్వాన్ని తెలుసుకోవాలంటే ఎక్కడికో పోనక్కర్లేదు. మన హృదయాన్ని మనము చూసుకుంటే, మన ప్రేమను పంచుకుంటే చాలు; భగవత్తత్త్వము సులభంగా మనకు అర్థమవుతుంది. ప్రేమపాశముచేతనే సర్వులు కట్టబడినారు. ప్రేమచేతనే అందరూ ఏకమైపోతారు. కనుక, మీరు ఎక్కడికి పోయినప్పటికీ ఐకమత్యంగా ఉండండి. ముఖ్యంగా యువకులు పదిమంది చేరితే ఎంతైనా సాధించవచ్చు. 'ఊరంతా ఒకటైతే చేనంతా ఒక మునుము' అంటారు. భగవత్ప్రార్థన, భగవన్నామము, భగవత్ప్రేమ – ఈ మూడే మనకు ముఖ్యంగా కావలసినవి. వీటిని ఆధారం చేసుకున్నప్పుడు ఎంతైనా సాధించవచ్చు.

మొన్న నేను మద్రాసుకు వెళ్ళినప్పుడు నాస్తికులైనవారుకూడా ఆస్తికులుగా మారిపోయారు. 'ఇంత కాలము దేవుడున్నాడని మేము నమ్మలేదు. కాని, స్వామిని చూసిన తరువాత ఇప్పుడు నమ్ముతున్నాము', అన్నారు. కరుణానిధి 'స్వామికి నా హృదయాన్ని అర్పితం చేస్తున్నాను', అన్నాడు.

**ఏ హృదయంబు నొసంగితివో ఈశ నాకు**
**మగిడి దానినే యర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేది తెత్తు నీ అర్చనకును**
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు**

భగవంతుడు మీకంటే వేరుగా లేడు. భగవంతుడు, మీరు ఒక్కటే, ఒక్కటే, ఒక్కటే! రూపనామములలో వ్యత్యాసమున్నదిగాని, భగవంతుడు ఒక్కడే! ఒక్కడే! ఒక్కడే!

sri sathyasai vahini vachanamrutam

రూపనామములు రవివర్మ, కవివర్మల కల్పితములేగాని, నిజానికి భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపం లేదు. కనుకనే, మహమ్మదీయులు ఏ రూపమునూ పెట్టుకోలేదు. 'అల్లాహు అక్బర్' అని ప్రార్థిస్తారు. అల్లాకు ఏ రూపమూ లేదు. అతనికంటే గొప్పవాడు మరొకడు లేడు. భగవంతుడు రూప రహితుడు. ఐతే, ఏ రూపమును తలుచుకుంటే ఆ రూపమును ధరిస్తాడు. "యద్భావం తద్భవతి" 'భగవంతుడు నా ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉండి నన్ను నడిపిస్తున్నాడు', అనే భావాన్ని పెట్టుకొని మీరందరూ సుఖంగా ఉండండి.

**(ఆదిలాబాద్ జిల్లా భక్తుల పర్తియాత్ర సందర్భంగా , తేదీ 11.02.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vacharamrutam